# జామాయిల్, సుబాబుల్ కొనుగోళ్ళలో ఐ.టి.సి. తదితర గుత్తసంస్థల దోపిడీ

**రైతులు** పండించిన పంటలకు ఉత్పత్తి ఖర్చులు పెరిగి, న్యాయమైన ధరలు కల్పించని ప్రభుత్వ విధానాలతో రైతులు దివాళా తీస్తున్నారు. ప్రభుత్వం, ఐ.టి.సి. ఈ పరిస్థితిని సాకుగా తీసుకొని సామాజిక వనాలు పథకం పేరుతో కాగిత పరిశ్రమలకు ముడి సరుకుగా వినియోగించే జామాయిలు, సుబాబులు, సరుగుడు తోటలు పెంచమని, పెట్టుబడి తక్కువ, లాభాలు ఎక్కువ అంటూ ప్రచారం చేసి ప్రారంభములో మొక్కలు ఉచితముగా, తరువాత తక్కువ రేట్లకు కోన్స్ యిచ్చి ప్రోత్సహించారు.

తోటల సాగుకు ఒక ఎకరాకు దున్నకం, మొక్కలు నాటుకూలీ, ఎరువులకు మామూలు మొక్కలైతే 15 వేల రూపాయలు ఖర్చు అవుతుంది. అదే క్లోన్స్ మొక్కలైతే 35 వేల వరకు ఖర్చు అవుతుంది. తోటలు కొట్టుడుకొచ్చేది 3, 4 సం॥లకొకసారి. అయితే పేపరు మిల్లులవారు మొదట లాభాలు చూపించి, క్రమంగా రేట్లు తగ్గిస్తూ సకాలములో డబ్బులు యివ్వకుండా రైతులను నష్టాలకు గురిచేసి యిబ్బందులపాలు చేశారు.

1998 నుండి రైతులు, రైతుసంఘాలు చేసిన ఆందోళనల ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి మార్కెట్ యార్డుల ద్వారానే కంపెనీలవారు కర్ర కొనుగోలు చేసి డబ్బులు చెల్లించాలనే విధానం అమలులోకి తెచ్చింది. రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు అయింది. రైతుల కర్ర ధరకు, డబ్బు చెల్లింపుకు హామీ ఏర్పడింది. ప్రపంచ మార్కెట్‌ను శాసిస్తున్న ఐ.టి.సి. మిగతా కంపెనీలతో సిండికేట్‌గా ఏర్పడి రైతాంగానికి ఉపయోగంగా వున్న, మార్కెట్ యార్డ్ అదుపులో సాగుతున్న కొనుగోళ్ళ విధానాన్ని, రివాల్వింగ్ ఫండ్‌ను గత పాలకుల ద్వారా రద్దు చేయించింది. దీనితో రైతాంగానికి తిరిగి కష్టాలు మొదలయ్యాయి.

ప్రతి 2 సం॥లకొకసారి జిల్లా కలెక్టర్‌గారి అధ్యక్షతన రైతులు, రైతుసంఘాల నాయకులు పేపరు మిల్లుల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఉత్పత్తి ఖర్చుల ఆధారంగా కర్రరేటుపై చర్చలు జరిపి కర్ర ధర నిర్ణయించడం జరిగేది. 2014-15 సం॥లో జామాయిల్ టన్నుకు రూ. 4,600/-లు, సుబాబుల్ టన్ను రూ. 4,400/-లు ప్రకారం కొనుగోలు చేయాలని నిర్ణయం జరిగింది. అయితే మిల్లులవారు ఈ నిర్ణయాలను తుంగలో తొక్కి తమ ఏజెంట్ల ద్వారా జామాయిల్ టన్నుకు రూ. 2,700/-లు, సుబాబుల్ టన్ను రూ. 3,700/- లకు ధరలు తగ్గించి కొనుగోలు చేశారు. ఈ పరిస్థితిపై రైతుసంఘాలు ఆందోళన చేసిన ఫలితంగా మార్కెట్ కమిటి అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుకున్న ఒప్పందం ప్రకారం కొనుగోళ్ళు చేయాలని ఆదేశించారు. కొంతమంది దళారులు రైతుల అవసరాలను ఆసరా చేసుకొని వారిని ప్రలోభపెట్టి తక్కువ ధరలకు మిల్లర్లకు సరఫరాచేస్తూ, ఒప్పందం ప్రకారమే రేట్లు యిస్తున్నట్లు రికార్డులలో చూపిస్తున్నారు. దీనితో రైతాంగం తీవ్ర మనోవేదనకు గురి అవుతున్నారు.

మార్కెటింగ్‌శాఖ కూడా కంపెనీలతో లోపాయికారి అవగాహనలు చేసుకొన్నందువలన - వ్యవసాయ మార్కెట్‌కమిటికి పేపరు మిల్లులు ఇచ్చిన బ్యాంకు గ్యారంటీ విలువకు మించి కర్రను సరఫరా చేస్తూ రైతులను ముంచివేశారు. ఇప్పటికీ యస్.పి.యం. కంపెనీ రైతాంగానికి దాదాపు 12 కోట్ల రూ॥లకు పైగా ఎగ్గొట్టింది. మార్కెటింగ్‌శాఖ, ఏ.యం.సి. దీనికి బాధ్యత వహించాల్సి ఉండగా నోరు మెదపకపోవటం దుర్మార్గం. ఏ నిబంధనల ప్రకారం బ్యాంకు గ్యారంటీకి మించి కర్రను సరఫరా చేశారో ఈరోజు వరకూ రైతాంగానికి జవాబు చెప్పలేదు. ఈ విధంగా ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖలు స్వదేశీ, విదేశీ కంపెనీల ప్రయోజనాలనే కాపాడుతూ వస్తున్నాయి.

ఐ.టి.సి. లాంటి బహుళజాతి కంపెనీ పోటీకి, ఎత్తుగడలకు మార్కెట్‌లో నిలబడలేక యస్.పి.యం. కంపెనీ మూతపడిందన్న విషయాన్ని గమనిస్తే - సుబాబుల్, జామాయిల్ రైతులను ఐ.టి.సి. కంపెనీ ఏవిధంగా లొంగదీసుకోబోతోందో అర్థమవుతుంది. పేపరు వ్యాపారంలో పూర్తిస్థాయి తన గుత్తాధిపత్యం వచ్చాక ఐ.టి.సి. కంపెనీ రైతులతో చేసుకున్న ఒప్పందాలను పక్కనపెట్టి ముడిసరుకును (కర్ర) చౌకగా కొల్లగొట్టడానికి ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నది. కర్ర కొనుగోలు ఒప్పందం జరిగి 2 సం॥లు దాటి పోయింది. కలెక్టర్ అధ్యక్షతన తిరిగి సరికొత్త ఒప్పందం చేసుకొని రేట్లు పెంచాల్సి వుంది. ఈ పని చేయకపోగా ప్రస్తుతం చెల్లిస్తున్న ధరకంటే టన్నుకు రూ. 500 తగ్గించాలని ఐ.టి.సి. కంపెనీ ప్రభుత్వంపై వత్తిడితెస్తూ చర్చలు జరపకుండా వాయిదా వేయిస్తున్నది. మరోవైపున దేశీయ మార్కెట్‌లో ప్రతి సం॥ పేపరు ధరను పెంచుతూనే వుంది. విదేశీ మార్కెట్‌లో పేపరు గుజ్జును, పేపరును అధిక రేట్లకు అమ్ముకొని కంపెనీల కోట్లకు పడగలెత్తుతూనే వుంది.

రాష్ట్రమంతా ఒకే ధర అమలు జరుగుతుండగా, జిల్లాలవారీగా ధరలు నిర్ణయించుకునే అవకాశం కల్పిస్తూ "143 జి.వో" తీసుకువచ్చి ప్రభుత్వం సుబాబుల్, జామాయిల్ రైతాంగ ఐక్యతను దెబ్బతీసే కుట్ర చేసింది. ఈ జి.ఓ. ప్రకారం జిల్లాస్థాయి కమిటీ స్వరూపం ఇలా ఉంటుంది. ఈ కమిటీకి జిల్లా కలెక్టరు ఛైర్మన్‌గా ఉంటాడు. కమిటి సభ్యులుగా - జిల్లా ఫారెస్ట్ అధికారి (సోషల్ ఫారెస్ట్); అగ్రికల్చరల్ జాయింట్ డైరెక్టర్; రీజనల్ ట్రాన్స్‌పోర్టు అధికారి (ఆర్.టి.ఓ.); అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్. వీరందరూ కలసి మరొక ఇద్దరు రైతులను జిల్లాస్థాయి కమిటీలోకి తీసుకుంటారు. ఇకనుంచి జిల్లాలవారీగా సుబాబుల్, జామాయిల్ రేట్లను ఈ 'కమిటీనే నిర్ణయిస్తుంది'.

ప్రభుత్వాన్ని లొంగదీసుకొన్న కంపెనీలు తమకు కావలసిన ముడిసరుకును కొల్లగొట్టడం కోసమే జి.ఓ. 143ను విడుదల చేయించారు. అంతేకాక సాగు విస్తీర్ణం, రైతుపేరు, సర్వేనెంబరుతో సహా వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని నిబంధన పెట్టారు. అలాగే కర్ర రేట్ల విషయంలో రాష్ట్రవ్యాపితంగా ఒకే ధర ఉండదు. జిల్లాకోరకంగా రేట్లు నిర్ణయించబడతాయి. ఏ జిల్లాలో తక్కువరేటు ఉంటే అక్కడే కొనుగోలు చేస్తారు. మిగిలిన చోట్ల అయినకాడికి తెగనమ్ముకొనే పరిస్థితి కల్పిస్తారు. గత అనుభవం కూడా ఇదే!

కర్ర సరఫరాకు సంబంధించి దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకుంటారు. గిట్టుబాటు ధరలకోసం సాగుతున్న రైతుల సంఘటితశక్తిని చీల్చడానికి కుట్రలు చేస్తున్నారు. ఈ క్రమం అంతా పాలకుల కనుసన్నల లోనే ఒకవిధానంగా అమలు జరుగుతున్నది. ఇదంతా కాంట్రాక్ట్ వ్యవసాయ విధానం అమలుకోసం జరుగుతున్న కుట్ర!

ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలోని పది జిల్లాలలో 4.55 లక్షల ఎకరాలలో సుబాబుల్, జామాయిల్ సాగు అవుతున్నది. ఇంత పెద్ద విస్తీర్ణంలో సాగు అవుతున్నపుడు వివిధ వాణిజ్య పంటలకు బోర్డులు ఉన్నట్లుగానే సుబాబుల్‌కు కూడా రాష్ట్రస్థాయిలో బోర్డును ఏర్పాటుచేసి ఒకే ధరను ప్రకటించి కొనుగోలు చేయాలన్న డిమాండుతో రైతాంగం ఉద్యమిస్తేనే తమ మనుగడ సాగుతుంది.

ప్రత్తి, మిర్చి, పసుపు, అపరాలు మొ॥లగు వాణిజ్య పంటలకు రాష్ట్రవ్యాపితంగా ఒకే ధరను నిర్ణయించే టప్పుడు – సుబాబుల్, జామాయిల్ పంటలకు జిల్లాకో రకంగా రేట్లు నిర్ణయించటం ఎవరి ప్రయోజనాల కోసం? అధికారంలోకి ఏ పాలకులు వచ్చినా రైతు సంక్షేమం, వ్యవసాయరంగ సంక్షేమం అంటూ రైతు పండించిన ఏ పంటకూ న్యాయమైన ధరను కల్పించటంలేదు. ఈ దశలో రైతాంగం తమ మనుగడ కోసం, వ్యవసాయరంగంలో బహుళజాతి కంపెనీల దోపిడి, ఆధిపత్యాలకు, కాంట్రాక్ట్ వ్యవసాయ విధానానికి వ్యతిరేకంగా, జి.ఓ. 143 రద్దుకోసం ఉద్యమించాలి.

- జి.ఓ. 143ను వెంటనే రద్దుచేయాలి.
- రివాల్వింగ్ ఫండును పునరుద్ధరించాలి.
- ఒప్పందం ప్రకారం కర్ర కొనుగోలు ధరను పెంచాలి.
- సుబాబుల్ బోర్డును వెంటనే ఏర్పాటుచేసి రాష్ట్ర వ్యాపితంగా ఒకే ధరను ప్రకటించి కొనుగోలు చేయాలి. దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలి.
- రైతులకు యస్.పి.యం. కంపెనీ చెల్లించాల్సిన 12 కోట్ల రూ॥లను వడ్డీతోసహా మార్కెటింగ్ శాఖ బాధ్యత వహించి వెంటనే చెల్లించాలి.
- ఐ.టి.సి. తదితర బహుళజాతి కంపెనీల ఆధిపత్యాన్ని రద్దుచేయాలి.

oooooo